క్లుప్తంగా

బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం నేడు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వ సభ్య సమావేశాన్ని భెల్ (హెచ్‌పీవీపీ) గెస్ట్‌హౌస్ ఆడిటోరియం (కళాభారతి)లో ఆదివారం నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి బి.వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి 3వ ఫేజ్ (పూర్తి స్థాయి మరియు వెయిటింగ్ లిస్ట్)లో ఉన్న సంఘం సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

విజ్ఞాన్ విద్యార్థులకు 'నిట్' ప్రశంసాపత్రం



వరంగల్ నిట్‌లో ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విజ్ఞాన్ విద్యార్థి

అగనంపూడి: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), వరంగల్‌లో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ సిమెంట్ అండ్ బిల్డింగ్ కాంక్రీట్ ఫర్ ఎ సెన్సబుల్ అండ్ రెసిలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే అంశంపై పరిశోధనా పత్రాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. దేశంలోని వివిధ కళాశాలల నుంచి 73 మంది విద్యార్థులు పరిశోధనా పత్రాలను ప్రెజెంట్ చేయగా, విజ్ఞాన్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

జాతీయ పోటీల్లో లింగేశ్వరరావుకు బంగారు పతకం



డబుల్స్‌లో బంగారు పతకం అందుకుంటున్న లింగేశ్వరరావు జోడీ

ఉక్కునగరం: జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బి.వి.ఎ స్.కె. లింగేశ్వరరావు సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో బంగారు పతకం సాధించారు. మార్చి 19 నుంచి 30 వరకు గోవాలో జరిగిన సన్‌రైజ్ యోనెక్స్ ఇండియన్ మాస్టర్స్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సింగిల్స్‌లో బంగారు పతకం సాధించగా, 55+ కేటగిరీలో ఎ.వి.రాజుతో డబుల్స్‌లో పాల్గొని బంగారు పతకం గెలుపొందారు. ఈ పోటీల్లో గెలవడం ద్వారా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు కొరియాలో జరగనున్న వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు.

మే 1 నుంచి దాసరి పైడిమాంబ ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: దాసరి పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను మే 1 నుంచి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు.

ఎయిర్ పోర్టు గోడ పక్క దాసరి మెట్టపై అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. విశేష హోమాలు, నిత్య పూజలతో అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి గోవింద్, సంధ్రాన అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి రోజు రూ.6.96 కోట్లు



వివిధ సంస్థల నుంచి వసూలైన ఆస్తిపన్ను చెక్కులను జెడ్సీకి అందజేస్తున్న రెవెన్యూ అధికారులు



సౌకర్యం కౌంటర్ వద్ద క్యూలైన్‌లో పన్ను చెల్లింపుదారులు

- రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు
- గాజువాక జోన్ డిమాండ్ రూ.62కోట్లు
- మొత్తం వసూళ్లు రూ.56.80 కోట్లు
- 94 శాతం పురోగతి సాధించిన సిబ్బంది

గాజువాక : 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను గాజువాక జోన్‌లో ఆస్తిపన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. మార్చి నెలాఖరు నాటికి బకాయిలను పూర్తిస్థాయిలో రాబట్టేందుకు జీవీఎంసీ రెవెన్యూ విభాగం ప్రణాళికాబద్ధంగా చేపట్టిన కృషి సత్ఫలితాలనిచ్చిందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కృషి, వడ్డీ మినహాయింపు కారణంగా ఆర్థిక సంవత్సరంలో ఆఖరి రోజైన శుక్రవారం ఒక్కరోజే రూ.6.96 కోట్లు వసూలు చేసి రికార్డు నమోదు చేశారు.

కలిసొచ్చిన వడ్డీ మినహాయింపు

1,18,650 ఇంటిపన్నుల అసెస్‌మెంట్లు ఉన్న గాజువాక జోన్‌లో ఏడాదికి రూ.62.41 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ బకాయిలను వసూలు చేయడానికి మూడు నెలల క్రితం నుంచే దృష్టి సారించిన అధికారులు మార్చి నెలాఖరు నాటికి రూ.50.13 కోట్లను వసూలు చేయగలిగారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన గురువారం జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి కాలనీల్లో పర్యటించారు. రెవెన్యూ అధికారులు రామనారాయణ, శ్రీకాంత్ నేతృత్వంలో ఆర్ఐలు, సచివాలయ అడ్మిన్‌లు ఆస్తి పన్ను బకాయిదారులను కలిసి పన్నులను చెల్లించేందుకు ఒప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వడ్డీ మినహాయింపు, తమ సిబ్బంది కృషితో ఇంత పెద్ద మొత్తంలో పన్నులను వసూలు చేయగలిగామని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. మొత్తం డిమాండ్‌లో 94 శాతం ప్రగతి సాధించినట్టు పేర్కొన్నారు. ఇతర పన్నులు కూడా భారీగానే వసూలయ్యాయి. పెండింగ్‌లో ఉన్న ఖాళీ స్థల పన్ను (వీఎల్‌టీ)లు, నీటి పన్ను కూడా ఆశాజనకంగా వసూలైనట్టు సిబ్బంది తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ అనంతరం విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: మానవత సేవా సంఘం చారిటబుల్ ట్రస్ట్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. చదువుపై ఆసక్తి ఉండి, ఆర్థిక స్థోమత సరిగ్గా లేని పేద విద్యార్థులు ఎవరైనా ఉన్నత చదువుల కోసం సహాయం అవసరమైతే, ట్రస్టును సంప్రదించాలని వారు సూచించారు. మానవత్వ సేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, లిటిల్ హోప్ చారిటబుల్ ట్రస్ట్, స్పందన చేయూత ఫౌండేషన్ మరియు పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న పలు కాలనీల వాసులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్ర నగర్‌ను ఆనుకుని ఉన్న డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ ఎదుట శుక్రవారం 16 గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు ఆందోళనకు దిగారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ముమ్మన మురళి, మంత్రి శంకరనారాయణ, ఎం.రాంబాబు, రంబ నారాయణమూర్తి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు రోజూ వస్తున్న టన్నుల కొద్దీ చెత్తను ఇక్కడే నిల్వ చేయడంతో దుర్వాసన వస్తోందన్నారు. దీంతో తాము ఇబ్బంది పడుతున్నామని, తరచూ వ్యాధులపాలవుతున్నామని చెప్పారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. డంపింగ్‌యార్డును తరలించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రామచంద్రనగర్, రిక్షా కాలనీ, గాంధీనగర్, బర్మా కాలనీ, స్వతంత్రనగర్, ఎస్టీ కాలనీ, గోపాలరెడ్డి నగర్, భరత్‌నగర్, శీరవానిపాలెం, నడుపూరుకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు 'నాట్స్' చేయూత

డిజిటల్ బోధనకు సహకారం అందించేందుకు సంసిద్ధం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాట్స్, గ్లో, కళాపీఠం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: 'భాషే రమ్యం..సేవే గమ్యం' నినాదంతో జన్మభూమికి సేవ చేయాలనే తలంపుతో ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు సహకారం అందిస్తున్నామని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) కన్వీనర్ అప్పసాని శ్రీధర్ అన్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలోని ప్రాథమిక పాఠశాలను నాట్స్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) ప్రతినిధులు శుక్రవారం సంయుక్తంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ప్రవాస భారతీయులందరూ కలిసి నాట్స్ సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించడానికి అవసరమైన సుమారు రూ.60 వేలు విలువ చేసే ప్రొజెక్టర్, స్క్రీన్, స్టాండ్‌లను నాట్స్ ద్వారా అందిస్తామన్నారు. విద్యార్థులకు పండ్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్లో కార్యదర్శి వై.వెంకన్న చౌదరి, నాట్స్ ఇండియా కో–ఆర్డినేటర్ ఎస్.రామా నాయుడు, పాఠశాల హెచ్‌ఎం జి.భాను తదితరులు పాల్గొన్నారు.

నాట్స్ జానపద సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

నాట్స్, గ్లో, మాత కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో శనివారం తెలుగు జానపద సంబరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీధర్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గౌతు శిరీష, శ్రీ మాతా కళాపీఠం నిర్వాహకులు పల్లి నాగభూషణం, బి.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాలి



ధర్నాలో పాల్గొన్న శ్రామిక సంఘం నాయకులు, కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా రాజకీయ పార్టీలు ఐక్యంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరుతూ సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పార్లమెంట్‌లో ప్రశ్నలు వేస్తే సరిపోతుందని భావించడం తగదన్నారు. దానికి తగ్గట్టు ఆందోళనలు, పోరాటాలు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వి. సన్యాసిరావు, పి. నూకరాజు, గణేష్‌బాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ యార్డు వేలంపాట ఖరారు



పత్రాలను అందజేస్తున్న ఐలా కమిషనర్ సూర్యనారాయణ, చైర్మన్ రఘు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ బ్లాక్‌లోని పార్కింగ్ యార్డు వేలంపాటను శ్రీ నూకమాంబిక ఇంజినీరింగ్ ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకుంది. ఆటోనగర్ ఐలా భవనంలో శుక్రవారం జరిగిన వేలంపాటలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ పార్కింగ్ యార్డు రుసుం రూ.4,32,300 లక్షలుగా నిర్ణయించారు. శ్రీ నూకాంబికా ఇంజనీరింగ్ ఎంటర్ ప్రైజెస్ రూ.4,36,300తో ఈ వేలంపాటను దక్కించుకోవడంతో, వారికి ఐలా కమిషనర్ డి.సూర్యనారాయణ, చైర్మన్ సత్యనారాయణరెడ్డి పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి కె.పద్మావతి, పారిశ్రామిక వేత్త బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



నెల్లిముక్కు రామాలయంలో శ్రీరాముని పట్టాభిషేకం

పెదగంట్యాడ: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు రామాలయంలో, 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సీతారాములను మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తాటికొండ కాశీ, సుదర్శన్, బెల్లాల నాగేశ్వరరావు, పప్పల నాగరాజు, కులుకూరి శ్రీనివాసరావు, రౌతు గోవింద్, కనక తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

పరిహారం కోసం ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన





షీలానగర్ కిమ్స్ ఐకాన్ వద్ద రోదిస్తున్న మృతుని భార్య, బంధువులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని యుజియా స్టెరైల్స్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు శుక్రవారం ఉదయం గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలు.. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలేనికి చెందిన ఉమ్మిడి వెంకటేష్ (32) యుజియా స్టెరైల్స్ పరిశ్రమలో పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం పరిశ్రమ వద్దకు వచ్చాడు. ఇంతలో ఆరోగ్యం బాగా లేదని క్యాంటీన్‌లో కాసేపు కూర్చుని ఉండగా తోటి కార్మికులు వెంకటేష్‌కు సపర్యలు చేశారు. అనంతరం విధులకు వెళుతుండగా ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో వన్‌ప్లస్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, 4, 6 సంవత్సరాల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటేష్ మృతదేహాన్ని షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

రూ.కోటి చెల్లించాలి

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు వెంకటేష్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

మృతుడి బంధువుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, గ్రామస్తులు హాస్పిటల్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. నష్టపరిహారంతో పాటు మృతుని భార్యకు కంపెనీలో ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్దకు కంపెనీ ప్రతినిధులు చేరుకొని కుటుంబ సభ్యులతో రాత్రి వరకు చర్చలు జరుపుతున్నారు. ఎటువంటి ఆందోళనకర సంఘటనలు జరగకుండా గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్, పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు.

గాజువాక బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా స్వామి, కృష్ణ



కె.వి.స్వామి, కృష్ణ

గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగాయి. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వెంకటస్వామి, బీవీఎం కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎం.రామ సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా ఎ.సీతా మహాలక్ష్మి, కోశాధికారిగా పల్లా శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా ఎస్.ఆదిలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా ఎంజీ డబ్ల్యూ డేవిడ్‌రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గిల్‌బెర్ట్ ఈదా, లంక సత్యనారాయణ, జంగాల శ్రీరామ్, జామి శ్యామలరావు, బాయన తులసీ వెంకట ప్రసాద్ ఎన్నికైనట్టు ఎన్నికల నిర్వహణాధికారులు వి.శ్రీనివాసరావు, ఎం.పార్వతీశం తెలిపారు.

778వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తూ, దేశ ఆర్థిక ప్రగతికి పునాదులు వేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని మరచిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 778వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన ఈ అండ్ ఎస్ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో విభాగాల కార్మికులు కూర్చుని, సంఘీభావం తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించేది లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కార్మికుల జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి ఐక్యంగా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

గాజువాక : గాజువాకలో బీజేపీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని, కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ తప్పకుండా గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మల్లికార్జునమూర్తి, సిరసపల్లి నూకరాజు, సోంబాబు, బొండా ఎల్లాజీరావు, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.15 కోట్ల పన్ను చెల్లించిన ఐలా

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీకి ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) శుక్రవారం రూ.2.15 కోట్లు పన్ను చెల్లించింది. జీవీఎంసీలోని వివిధ విభాగాలకు ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ ఈ పన్ను చెల్లించినట్లు ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి వినతి



ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్టీల్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు సంఘం నాయకులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ రామ్‌నాథ్ పార్థీని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి. తౌడన్న తదితరులు ఢిల్లీలోని కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు.

ఫార్మా కంపెనీ సహకారంతో పాఠశాలలో 'మరుగు' వసతి



పాఠశాలలో మరుగుదొడ్ల బ్లాక్‌ను ప్రారంభిస్తున్న ఠాగూర్

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్ల బ్లాక్‌ను అజినోమోటో బయో ఫార్మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఠాగూర్, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. సంస్థ సీఆర్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రూ.26లక్షల వ్యయంతో బాలబాలికలకు మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించినట్లు ఠాగూర్ తెలిపారు. కార్పొరేటర్ లక్ష్మి మాట్లాడుతూ ఫార్మా కంపెనీల సహకారంతో కాలనీల్లోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. బాలలకు మరుగుదొడ్లు నిర్మించేందుకు ముందుకు వచ్చిన అజినోమోటో యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అమ్మాజీ, ఇన్‌చార్జి వెంకటరావు, సంస్థ ప్రతినిధులు శర్మ అలేఖ్య, శ్రీనివాస్, అభిరామ్, తేజ పాల్గొన్నారు.

గోతిలో పడిన ద్విచక్రవాహనం

యువకుడికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలపాలైన సాయి

అక్కిరెడ్డిపాలెం: కేబుల్స్ కోసం తవ్విన గోతిలో ద్విచక్రవాహనంతో సహా పడిన యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి. సుజాతనగర్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎ.సాయి (27) తుంగ్లాంలో స్నేహితులను కలిసి గురువారం అర్ధరాత్రి తిరిగి వస్తుండగా, ఆటోనగర్ కెనరా బ్యాంక్ వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో కేబుల్స్ నిర్మాణం కోసం తీసిన గోతిలో తన ద్విచక్రవాహనంతో సహా పడిపోయాడు. ఈ ప్రమాదంతో యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన కొందరు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని వెంటనే గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సదరు కేబుల్స్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నష్టపరిహారం చెల్లించాలంటూ యువకుని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారని సమాచారం.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

160 కేజీల గంజాయి పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: నిషేధిత గంజాయిని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ డీ బ్లాక్‌లోని సెఫ్ ఎక్స్‌ప్రెస్ పార్సిల్ గొడౌన్‌కు ఇసుకతోటకు చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆటోలో పార్సిల్ చేసిన 160 కేజీల గంజాయిని తీసుకువచ్చారు. గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో గాజువాక పోలీసులు గొడౌన్ వద్దకు చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకుని, ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాపై ఆటో డ్రైవర్ నుంచి వివరాలు సేకరించగా కరాసలో ఒక వ్యక్తి ఆటోనగర్ పార్సిల్ సర్వీసుకు బేరం మాట్లాడాడని తెలిపాడన్నారు. దీంతో గంజాయిని తీసుకువచ్చిన అసలు వ్యక్తి పరారీలో ఉండగా, ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.